క్లుప్తంగా

ఇంటి ఆవరణలో ఔషధ మొక్కలు నాటాలి



సదస్సులో మాట్లాడుతున్న సైంటిస్ట్ జగన్నాథశర్మ

కాకినాడ రూరల్: ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ, వనమూలికల మొక్కలు ఇంటి ఆవరణలో నాటుకోవాలని శాస్త్రవేత్త కె.జగన్నాథ శర్మ పేర్కొన్నారు. జాతీయ వనమూలికల, ఔషధ మొక్కల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కలు ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా అనేక రకాల సౌందర్య ఉత్పత్తులలో వినియోగిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీటి వలన మంచి ప్రయోజనం పొందుతున్నారని, పురుగు మందు వాడకుండా ఇంట్లో లభించే ఉల్లి, వెల్లుల్లి తదితర వాటి ద్వారా ఎరువులు తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆహార వ్యర్థాలతో దుర్వాసన



ఎస్ఈ వెంకట్రావుకు వినతిపత్రం ఇస్తున్న శ్రీవిద్యాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: డీ మార్ట్ పక్కన పార్కు గోడకు ఆనుకొని ఉన్న బడ్డీలను తొలగించాలని శ్రీవిద్యా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నగరక పాలక సంస్థ ఎస్ఈ వెంకట్రావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. చికెన్ సూపులు, చీకులు వంటి ఆహార పదార్థాలు ఈ బడ్డీల వద్ద విక్రయించడం వల్ల అక్కడే ఈ వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. పార్కులో వాకింగ్ వచ్చే వాకర్స్ వాకింగ్, వ్యాయామం చేయడానికి అవస్థలు పడుతున్నారన్నారు. ఈ దుర్వాసన కారణంగా ఇక్కడ వాకింగ్ చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. ఇక్కడ పాడేసిన వ్యర్థాలు కుక్కలు సమీప ఇళ్ల సమీపంలో వదలడంతో దుర్వాసన వస్తున్నాయన్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించిన ఇక్కడ అనధికారంగా ఏర్పాటు చేసిన షాపులు తీసివేయించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఎ.లక్ష్మీనారాయణ, కె.నరసింహారావు, జి.పార్థసారథి, గొడవర్తి సత్యమూర్తి కోరారు.

మహిళా మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

కాకినాడ క్రైం: ఫిట్స్‌కి గురైన ఓ గుర్తు తెలియని మహిళ ప్రాణాలు కోల్పోయింది. కాకినాడ త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ సోమవారం మధ్యాహ్నం కాకినాడ మెక్లారిన్ స్కూల్ సమీపంలో రోడ్డు పక్కన నిల్చొని ఉండగా ఫిట్స్‌కు గురైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గమనించి ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆమెను ఆటో ఎక్కిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందింది. దీంతో అక్కడి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. మహిళ వయసు సుమారు 45 ఏళ్లు ఉండొచ్చనీ, తెలుపు, గులాబీ రంగుతో కూడిన చుడీదార్ ధరించి ఉందని త్రీ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆమె సంబంధీకులు ఎవరైనా ఉంటే కాకినాడ త్రీ టౌన్‌కు రావాలని లేదా 9440796542 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రతిజ్ఞ



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్టేషన్ మేనేజరు రమేష్

సామర్లకోట: రైల్వేస్టేషన్‌తో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ సోమవారం సాయంత్రం స్టేషన్ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత పక్షోత్సవాల్లో భాగంగా రైల్వే స్టేషన్ పరిధిలో ర్యాలీ నిర్వహించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఈ మేరకు ముందుగా రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లోని ప్లాటు ఫారాలు, రైల్వే కాలనీ, విశ్రాంతి గదులు, డార్మెటరీలు, హాస్పిటల్స్, హెల్త్ యూనిట్లు, రైల్వే యూనియన్ కార్యాలయాలు, పరిశీలించారు. ఈ మేరకు ఆయా డిపార్టుమెంట్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనీటైం నో క్యాష్

- నగరంలో పని చేయని ఏటీఎంలు
- సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం
- ప్రతి ఆరు నెలలకు బ్యాంకు చార్జీలు రూ.180 వసూలు
- ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు



రాజేశ్వరినగర్‌లో పని చేయని సీడీఎం



భానుగుడి సెంటర్ పని చేయని ఏటీఎం

బోట్‌క్లబ్: అత్యవసర పరిస్థితుల్లో నగదు కోసం ఏటీఎంలకు వెళితే అక్కడ నో క్యాష్ బోర్డు దర్శనమిస్తోంది. పోనీ మరో బ్యాంకు ఏటీఎం దగ్గరకు పరుగులు తీసినా అది కూడా మూసివేసి ఉంటోంది. దీంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాకినాడ నగరంలో ఒక్క ఎస్‌బీఐ బ్యాంకుకు సంబంధించి 23 శాఖలు ఉన్నాయి. ఒక్కో శాఖలో 70 నుంచి లక్ష వరకూ ఖాతాదారులు ఉన్నారు. ఈ ఖాతాదారులు నుంచి ఏటీఎం వినియోగించినందుకు చార్జీల కింద ప్రతి ఆరు నెలలకు ఒకసారి రూ.180 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఎస్‌బీఐ వినియోగదారుడి నుంచి కాకినాడ నగరంలో ఆరు నెలలకు గాను రూ.37.26 కోట్లు వసూలు చేస్తున్నారు. కానీ ఎస్‌బీఐ ఏటీఎంలు మాత్రం ఎక్కడా సక్రమంగా పనిచేయవు. చార్జీలు మాత్రం ఖాతాదారుని ఖాతా నుంచి లాగేసుకుంటున్నారు. వాస్తవానికి ఇక్కడ సేవలు మాత్రం అందడంలేదు. ఇక యూనియన్ బ్యాంకులు, కెనరా బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకు వందకుపైగా శాఖలు ఉన్నాయి. వాటన్నింటికి క్రమం తప్పకుండా ఏటీఎం చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ ఆయా శాఖలకు చెందిన ఏటీఎంలో మాత్రం డబ్బులే ఉండవు.

సక్రమంగా పనిచేయకపోవడంతో...

సీడీఎం(క్యాష్ డిపాజిట్ మెషీన్)లు సంగతి చెప్పనక్కర్లేదు. ఇవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు పడరానిపాట్లు పడుతున్నారు. అత్యవసరంగా ఖాతాల్లో డబ్బులు వేసుకొనేవారు కొందరైతే, వేరేవాళ్లకు డబ్బులు పంపేవారు మరికొందరు ఉంటున్నారు. స్టేట్‌బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకుతోపాటు పలు బ్యాంకులు ఆయా బ్రాంచిల సమీపంలో సీడీఎం మెషీన్లు ఏర్పాటు చేశాయి. కానీ ఇవి సక్రమంగా పనిచేయడం లేదు. అవసరానికి డబ్బులు వేస్తే మెషీన్ మరమ్మతుల కారణంగా సగంలోనే ఆ ప్రోసెస్ నిలిచిపోవడంతో డబ్బులు ఖాతాల్లో పడక, వినియోగదారుడు చేతికిరాక నానా అవస్థలు పడుతున్నాడు. సీడీఎంలో డబ్బులు వేసే సమయంలో నెట్‌వర్క్ సక్రమంగా లేకపోతే డబ్బులు తమ ఖాతాలో జమకావు. దీంతో బ్రాంచ్‌కు వెళ్లి పరిస్థితి వివరించి అక్కడ దరఖాస్తు చేసుకొంటే ఆక్కడ సిబ్బంది పరిశీలించి నాలుగైదు రోజుల్లో ఆ నగదు మన ఖాతాల్లో వేస్తారు. అవసరం కోసం డబ్బులు వేస్తే నాలుగైదు రోజుల తర్వాత ఖాతాల్లో వేస్తున్నారు. పోనీ బ్యాంకుల్లో వేద్దామని వెళితే చిన్న మొత్తాలు అసలు తీసుకోవడమేలేదు. రూ.50 వేలు పైబడి డిపాజిట్ చేసేవారు మాత్రమే బ్యాంకులకు రావాలని నిబంధనలు ఉన్నాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.

వినియోగించే వారు తక్కువే..

ప్రస్తుతం ఏటీఎం వినియోగించే వారు బాగా తగ్గిపోయారు. ప్రస్తుతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యూపీఐ సేవలు అందుబాటులోనికి రావడంతో దాదాపు 90 శాతం మంది వీటిపైనే ఆధారపడుతున్నారు. ఏటీఎంలు వినియోగించే వారు 10 శాతం మాత్రమే ఉంటున్నారు. వినియోగించేవారు తక్కువగా ఉన్నా ఏటీఎంలో క్రమం తప్పకుండా డబ్బులు పెట్టకుండా ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డబ్బులు అయిపోయిన రెండు మూడు రోజులకు కూడా డబ్బులు నింపకపోవడంతో ఖాతాదారులకు అవస్థలు పడుతున్నారు.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడంతో...

ఏటీఎంలో డబ్బులు నింపే పనిని ఆయా శాఖలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి బ్యాంకులు చేతులు దులిపేసుకుంటున్నాయి. డబ్బులు అయిపోయిన వెంటనే ఆయా ఏటీఎంలో డబ్బులు నింపకపోవడంతో తరచూ ఏటీఎం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బ్యాంకు డబ్బులు నింపే ఏటీఎంలో కాస్త మెరుగుగానే సేవలు అందుతున్నాయి. అక్కడ ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది ఏటీఎంలో డబ్బులు నింపుతున్నారు.

పని చేయని సీడీఎంలు



బ్యాంకు సమయం మూసిన తర్వాత ఎవరికైనా అత్యవసరం డబ్బులు పంపుదామని సీడీఎం మెషీన్ వద్దకు వెళితే అది పనిచేయడం లేదు. ఒక్కొక్క సారి డబ్బులు తీసుకొన్నా మా ఖాతాల్లోకి రావడం లేదు. మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసిన నాలుగైదు రోజులు తర్వాత మా ఖాతాల్లోకి వస్తున్నాయి. దీంతో అవసరం తీరడం లేదు. ఇబ్బంది పడుతున్నాం.

– దొరబాబు, వ్యాపారస్తుడు

హర్‌ఘర్ తిరంగా యాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర్రావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): బీజేపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్‌ఘర్ తిరంగా యాత్రలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు నియమించారు. కాకినాడ సిటీ ఇన్‌చార్జిగా బిక్కిన విశ్వేశ్వరరావు, జగ్గంపేట, పెద్దాపురం ఇన్‌చార్జిగా దాట్ల కృష్ణవర్మ, పిఠాపురం, కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా చోడిశెట్టి రమేష్ బాబు, తుని, ప్రత్తిపాడు నియోజవర్గానికి కుండల సాయికుమార్‌ను నియమించారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఐపీఎస్ లక్ష్మీనారాయణ

బాలాజీచెరువు: నేటి కాలంలో యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని మాజీ ఐపీఎస్ వీవీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు పదిరోజుల పాటు నిర్వహించే ఇండక్షన్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా యువత స్మార్ట్ ఫోన్లతో కాలం వృథా చేస్తున్నారని, ఆ సమయాన్ని గ్రంథాలయం, క్రీడలు వంటి వాటికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన టెక్నాలజీకు అనుగుణంగా మారాలని, కొత్త విషయాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు, స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టులకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫెడరేషన్ అధ్యక్షుడు నవీన్‌రాజు తదితరులు

- జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిరసన
- వైఎస్సార్ సీపీ సంఘీభావం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు కదం తొక్కారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ పిలుపు మేరకు సోమవారం డిమాండ్స్ డే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేసి రాస్తారోకో చేశారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్ సగిలికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై ప్రభుత్వాల వైఖరి మారాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని జీఓలు విడుదల చేస్తూ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. అక్రిడేషన్లు ప్రతి ఏడాది ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. బీహార్‌లో మాదిరిగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడేషన్ల జీఓ జారీ, సమాచార శాఖను బలోపేతం, మీడియా కమిషన్‌ను ఏర్పాటు, బీమా సదుపాయం, ఏసీ బస్సు ప్రయాణ సౌకర్యం, ఆరోగ్య బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు ఎండీ అధికార్, జి.శోభన్ బాబు, డి.శ్రీధర్, త్రినాథ్, బాబీ, సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఫెడరేషన్ డిమాండ్స్ డేకు వైఎస్సార్ సీపీ నేతలు సంఘీభావం తెలియజేశారు. జర్నలిస్టుల న్యాయ పరమైన డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తూ జర్నలిస్టులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తదితరులు ఉన్నారు.

కౌడా నిధులతో అభివృద్ధి పనులు

సమావేశంలో ఛైర్మన్ తుమ్మల రామస్వామి



సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), వీసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, త్వరలో కాకినాడ సూర్యారావుపేటలోని బీచ్ పార్కున్ ప్రారంభించనున్నట్టు ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) పేర్కొన్నారు. కాకినాడలో కౌడా కార్యాలయంలో సోమవారం ఛైర్మన్ అధ్యక్షత కౌడా సమావేశం నిర్వహించారు. వైస్ ఛైర్మన్ హోదాలో జేసీ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌడా నిధులతో చేపడుతున్న పనులపై అధికారులతో చర్చించారు. పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రూ.1.50కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కాకినాడ బీచ్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో బీచ్, పరిసర ప్రాంతాలు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కౌడా సెక్రటరీ కాశీబాబు, డీఈ సీహెచ్ రామారావు, ఏపీఓలు కృష్ణారావు, శివరామకృష్ణ పలు శాఖ అధికారులను వీసీ రాహుల్ మీనా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు



ఎరువుల కోసం సామర్లకోట సొసైటీ వద్ద బారులు తీసిన రైతులు

సామర్లకోట: మండల పరిధిలో 80 శాతం వరినాట్లు పూర్తి కావడంతో రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్థానిక సొసైటీకి ఎరువులు రావడంతో రైతులు పరుగులు తీశారు. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులు రావడంతో స్థానిక ప్రాథమిక సహకారం సంఘం వద్ద రైతులు తెచ్చిన మోటారుసైకిళ్లు రోడ్లపై పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం సొసైటీ సభ్యులు వాహనాలను క్రమ పద్ధతిలో పెట్టారు. సొసైటీ అధ్యక్షుడు పైడి శ్రీనివాసు, సిబ్బంది ఆధార్ కార్డులను తీసుకొని సీరియల్ నంబరు కూపన్లు ఇచ్చారు. ఇటీవల రైతు సేవా కేంద్రం ద్వారా డీఏపీ ఇవ్వడంతో ప్రస్తుతం వరి చేలకు యూరియా కావాల్సి ఉందని రైతులు తెలిపారు. దాంతో ప్రతి రైతుకు నాలుగు బస్తాలు యూరియా ఇవ్వనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు తెలిపారు. సొసైటీ ఎరువులు విక్రయించడానికి 2019లో లైసెన్సు అయి పొందని వారికి ప్రస్తుతం కొత్త లైసెన్సుకు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులు విక్రయిస్తున్నట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రం రైతులకు దూరంగా ఉండడం వలన రైతులకు అందుబాటులో ఉండేలా రెండు చోట్ల విక్రయిస్తున్నట్టు చెప్పారు. ప్రతి రైతుకు ఎకరానికి ఒక బస్తా డీఏపీ ఇవ్వడం జరిగిందని, 4 బస్తాలు యూరియా ఇస్తున్నామని మండల వ్యవసాయాధికారి వి.మురీధర్ తెలిపారు. పట్టణ పరిధిలో సుమారు 8 ఎరువులు, పురుగు మందుల షాపులు ఉండగా ఆయా షాపులలో ఎరువుల లభించకపోవడంతో రైతు సేవా కేంద్రాలకు వస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకొంటున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఐదో తేదీన మరో లోడ్ వస్తుందని రైతులు ఆందోళన పడొద్దని లేదన్నారు. లిక్విడ్ యూరియా, లిక్విడ్ డీఏపీలపై రైతులకు అవగాహన పెంచుతున్నామని తెలిపారు. సొసైటీ డైరెక్టరు తుమ్మల శ్రీను, సీఈఓ మారుతిబాబు రైతులకు సేవలందించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు శ్రావణ మాసం దశమి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మ వార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదం అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లోకి రాజగోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, గొంచాలలోని శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మోటారు సైకిల్ చోరీ

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు పార్కు చేసిన మోటారుసైకిల్ దొంగతనానికి గురైంది. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సమయం వెంకటేష్ ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. ఇంటి గుమ్మం ఎదురుగా మోటారు సైకిల్‌ను పార్కు చేశాడు. భోజనం చేసి తిరిగి బయటకు వచ్చి చూసే సరికి మోటారు సైకిలు కనిపించలేదని పోలీసులకు తెలిపాడు.

మరుభూమిని బాగు చేయండి



కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్న మరుభూమి



పాడా కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఇంద్రనగర్ వాసులు

అధికారులకు ఇంద్రనగర్ వాసుల విన్నపం

పిఠాపురం: ఆ నలుగురు అడుగు పెట్టాలన్నా నరకం కింద ఉంది. అంతిమ సంస్కారాలు చేయడం ఎంతో ఇబ్బందిగా ఉంది. మరుభూమిని బాగు చేయండంటూ పిఠాపురం ఇంద్రనగర్ వాసులు అధికారులకు విన్నవిస్తున్నారు. తమ పరిధిలో ఉన్న మరుభూమి అడుగు పెట్టడానికి వీలు లేకుండా అసాంఘిక కార్యక్రమాలకు అనువుగా మారిందని దానిని వెంటనే బాగు చేసి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ కౌన్సిలర్ బోను దేవ ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మరుభూమిలో పిచ్చి మొక్కలు మొలిచి అడుగు పెట్టడానికి వీలు లేకుండా తయారయ్యిందన్నారు. ఇదే అదనుగా భావించిన ఆకతాయిలు మందు బాబులు మరుభూమిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. స్థానికులు ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేయడం నరక యాతనగా మారిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరుభూమిని బాగు చేయించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కార్యాలయంలో పర్యవేక్షణ కీలకం

ఎంపీడీఓల శిక్షణలో ప్రిన్సిపాల్ ప్రసాదరావు



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ కార్యాలయం పర్యవేక్షణ ఎంపీడీఓ బాధ్యత అని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కేఎన్‌వీ ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల శిక్షణలో భాగంగా సోమవారం ఆయన వారికి శిక్షణ నిర్వహించారు. కార్యాలయ నిర్వాహణ, ఉద్యోగుల పనితీరు, ఇతర పరిపాలన సంబంధిత అంశాలను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష చేయాలన్నారు. ఆర్థిక నిధుల వినియోగం బడ్జెట్ నిర్వాహణ వంటి ఆర్థిక లావాదేవీలను ఎంపీడీఓలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యాలయంలోని అన్ని ముఖ్యమైన పత్రాలు, రికార్డులు, ఫైళ్లను పర్యవేక్షించాలన్నారు. ఆర్థిక అవకతవకలను నిరోధించడానికి తగిన సూచనలు, సలహాలను కింది స్థాయి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మండల ప్రజా పరిషత్ పరిధిలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల తోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓలకు ఉన్న హక్కులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు చేసిన వారికి తగిన సమాధానం ఇచ్చి, సంతృప్తి చెందేలా చూడాలన్నారు. అంతకు ముందు సీనియర్ ఫ్యాకల్టీ చక్రపాణిరావు ట్యాక్సు, నాన్ ట్యాక్సుపై శిక్షణ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు కేఆర్ నిహారిక, కె.సుశీల, శర్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు



ఎంపిక అయిన విద్యార్థులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెద్దాపురం మహారాణి కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్–18 విభాగంలో డి.రాజేష్ 1000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించడం, ఎస్.యుగేష్ 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించగా అండర్–14 విభాగంలో ఆర్.పవన్ గణేష్ జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఎంపిక అయిన విద్యార్థులు ఈనెల 9 నుంచి 11 వరకు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు నిరంతరం క్రీడా శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయుడు ఎం.గోవిందును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అభినందించారు.

నూకాలమ్మకు వెండి కవచం సమర్పణ



అమ్మవారికి వెండి వస్తువులు తీసుకొస్తున్న దాతలు



దాతలు ఇచ్చిన వెండి వస్తువులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి దాతలు వెండి కవచం, ఆయుధ సహిత హస్తములు, సూర్యచంద్రులను సమర్పించినట్లు ఈఓ రాంబాబురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస సత్యేంద్ర, పద్మజ నాయుడు దంపతులు అమ్మవారికి వెండి వస్తువులు సమర్పించారు. దాతలకు ఈఓ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.